సాక్షి
తిరుపతి
బుధవారం। 20। ఆగస్టు। 2025



ఉపాధి పనులపై విచారణ

ఉపాధిహామీ పనులపై బహిరంగ విచారణ చేపట్టారు. గుంతల తవ్వకాల అక్రమాలపై విచారణకు ఆదేశాలు ఇచ్చారు. - 8లో



రహదారుణాలు

జిల్లాలో కురుస్తున్న వర్షాలకు రహదారులు దారుణంగా తయారయ్యాయి. నాణ్యతలేని మరమ్మతు పనులు తేలిపోయాయి. - 8లో



వాహనాలు ఢీ..

అయ్యవురెడ్డి పాళెం సమీపంలోని జాతీయ రహదారిపై నాలుగు వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. - 8లో

న్యూస్‌రీల్

శబరిమలకు పెద్దిరెడ్డి



ఇరుముడితో బయలుదేరిన పెద్దిరెడ్డి, ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, ఎమ్మెల్సీ భరత్, నేతలు

తిరుపతి మంగళం : అయప్పమాల ధరించి దీక్షలో ఉన్న మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శబరిమల అయప్ప దర్శనానికి బయలుదేరి వెళ్లారు. తిరుపతి మారుతీనగర్‌లోని తన నివాసంలో మంగళవారం పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో పాటు తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, ఎమ్మెల్సీ భరత్, పెద్దిరెడ్డి అనుచరులు అయప్ప పూజలు చేసి ఇరుముడి కట్టుకుని రైలులో శబరిమలకు బయలుదేరి వెళ్లారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు ఇంటర్వ్యూలు

పాకాల : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెమిస్ట్రీ గెస్ట్ లెక్చరర్ పోస్టుకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వి.రమేష్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో 55 శాతం మార్కులు కలిగి ఉండాలని, పీహెచ్‌డీ, నెట్ ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు అన్ని ఒరిజనల్ సర్టిఫికెట్స్, జిరాక్స్ కాపీలతో ఈనెల 23వ తేదీన ఉదయం 10.30 గంటలకు కళాశాలకు హాజరు కావాలని కోరారు. అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


ఎస్వీ వెటర్నరీలో జాతీయ సదస్సు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న శాస్త్రవేత్తలు

చంద్రగిరి : శ్రీ వెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయంలో రెండు రోజుల జాతీయ సదస్సు మంగళవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన శాస్త్రవేత్తలు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తమిళనాడుకు చెందిన శాస్త్రవేత్త డాక్టర్ కుమరన్, హర్యానకు చెందిన శాస్త్రవేత్త డాక్టర్ నరేష్ జిందాల్ హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆంత్రాక్స్ వ్యాధిని నిర్మూలించడంలో వచ్చే సవాళ్ల గురించి చర్చించారు. కార్యక్రమంలో పరిశోధన విభాగం డైరెక్టర్ శ్రీలత, డైరెక్టర్ శోభన, చెంగల్రాయులు తదితరులు పాల్గొన్నారు.

మేం పేదలం కాదా



బంగారు కుటుంబాల ఎంపికపై పేదలు భగ్గుమంటున్నారు. ఎమ్మెల్యేల సిఫార్సు ఉంటేనే పీ–4కు ఎంపిక చేస్తున్నారని మండిపడుతున్నారు. 6 లక్షల మంది పేదలు ఉంటే కేవలం 80 వేల మందినే ఎంపిక చేయడంపై విమర్శలు చెలరేగుతున్నాయి. ముఖ్యంగా ఓ పార్టీ సానుభూతిపరులనే పీ–4లో చేర్చారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పీ–4 కేవలం పార్టీ కార్యక్రమంగా మారుస్తున్నారంటూ అక్కడక్కడా అధికార పార్టీ నేతలను నిలదీస్తున్నారు.

పీ-4 ఎంపికలో పారదర్శకతకు పాతర

- కూటమి మద్దతుదారులకే అవకాశం
- బంగారు కుటుంబాల ఎంపికపై పేదల నిలదీత
- ప్రభుత్వ కార్యక్రమమా? పార్టీ కార్యక్రమమా?అని ప్రశ్నిస్తున్న పేదలు

తిరుపతి తుడా : పేదరిక నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం పీ–4తో బంగారు కుటుంబాలను చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పబ్లిక్, ప్రైవేట్, పీపుల్, పార్టనర్‌షిప్‌తో పేద కుటుంబాలను దత్తత తీసుకొని వారి జీవితాలలో మార్పు తీసుకొచ్చేందుకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం వివాదాస్పదంగా మారుతోంది. పీ–4కు కొంత మందినే ఎంపిక చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎంపిక విధానం బాగోలేదని, ఎమ్మెల్యేల సిఫార్సు మేరకే కుటుంబాలను ఎంపిక చేశారని, ముఖ్యంగా ఓ పార్టీకి చెందిన సానుభూతిపరులనే ఈ కార్యక్రమంలో చేర్చారంటూ విమర్శలు చెలరేగుతున్నాయి. మేము పేదలం కాదా ? మా కుటుంబాల్లో మార్పు వద్దా? పీ4 కు మేము పనికిరామా? ఇక మా ఓట్లు అడగరా అంటూ పేదలు ఎక్కడికక్కడ అధికార పార్టీ నేతలను నిలదీస్తున్నారు.

6 లక్షల మందిలో 80 వేలే ఎంపిక..

తిరుపతి జిల్లాలో 5,95,200 కుటుంబాలు బిలో ప్రాపర్టీ లైన్ (బీపీఎల్) కింద పేదలుగా జీవిస్తున్నారు. ప్రభుత్వ అధికారిక లెక్కల ప్రకారం పేదలు ఈ స్థాయిలో ఉన్నారు. పేదరిక నిర్మూలనలో భాగంగా వారిని బంగారు కుటుంబాలుగా మార్చేందుకు ప్రభుత్వం పీ–4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అయితే 80,370 కుటుంబాలను మాత్రమే పీ–4లో చేర్చడం వివాదాస్పదంగా మారింది. దీంతో మిగిలిన పేద కుటుంబాలు మేము పేదలం కాదా? మా కుటుంబాల్లో మార్పు తీసుకురారా? అంటూ నిలదీస్తున్నారు. జిల్లాలో 80 వేల 370 కుటుంబాలను ఎంపిక చేసి 5,14,830 కుటుంబాలను ప్రభుత్వం విస్మరించింది. దీంతో ప్రభుత్వ విధానంపై పేద కుటుంబాలు భగ్గుమంటున్నాయి. మీరు ఎంపిక చేసిన కుటుంబాలనే వచ్చేసారి ఓట్లు అడగండి అంటూ మండిపడుతున్నారు. దాదాపు ఆరు లక్షల మంది నిరుపేద కుటుంబాలు ఉంటే సుమారు 80,370 కుటుంబాలనే ఎంపిక చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఎమ్మెల్యే సిఫార్సు ఉంటేనే ఎంపిక

బంగారు కుటుంబాలు కార్యక్రమానికి పేదలను ఎంపిక చేసిన విధానంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఎంపిక నిబంధనలు పేపర్లో మాత్రమే ఉన్నాయని, క్షేత్రస్థాయిలో ఆ ప్రక్రియ సక్రమంగా జరగలేదని పేదలు వాపోతున్నారు. అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేల సిఫార్సులు మేరకే ఎంపిక జరిగిందని రాజకీయ పార్టీలు సైతం దుమ్మెత్తిపోస్తున్నాయి. ముఖ్యంగా టీడీపీ సానుభూతిపరులనే బంగారు కుటుంబాలకు ఎంపిక చేశారన్న విమర్శలతో ప్రభుత్వం అబాసుపాలవుతోంది. పీ–4 ప్రభుత్వ కార్యక్రమమా? లేదా పార్టీ కార్యక్రమమా? చెప్పాలంటూ జనసేన, బీజేపీ నేతలు సైతం అక్కడక్కడా నిలదీస్తున్నారు.

జిల్లా సమాచారం

జిల్లాలో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలు	5,95,200
పీ–4కు అర్హత సాధించిన కుటుంబాలు	80,370
ఇప్పటి వరకు ఎంపిక చేసిన కుటుంబాలు	20,120

తప్పించుకునేందుకు ఎత్తుగడ

ప్రజా సంక్షేమం, అభివృద్ధి నుంచి రాష్ట్ర ప్రభుత్వం తప్పించుకునేందుకు ఎత్తులు వేస్తోంది. ప్రజలకు చేయాల్సింది చేయకపోగా పేదరిక నిర్మూలన పేరుతో ప్రభుత్వం కొత్త డ్రామాకు తెరలేపింది. పేద ప్రజలకు ప్రభుత్వం చేయాల్సింది చేయకపోగా ఆ బాధ్యతలను అధికారులు, సిబ్బంది, ప్రభుత్వ అనుబంధ సంస్థల ప్రతినిధులకు అప్పగించడంపై విమర్శలు చెలరేగుతున్నాయి. ప్రభుత్వం నుంచి ఒత్తిడి వస్తుండడంతో అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. మార్గదర్శకులను ఎంపిక చేయలేక తలలు పట్టుకుంటున్నారు. వరుస సమీక్షలు, సమావేశాలు, టెలీకాన్ఫరెన్స్‌లతో కిందిస్థాయి అధికారులు, సిబ్బంది ముప్పుతిప్పలు పెడుతున్నారు.

రూ.30 వేల జీతగాళ్లకు దత్తత సాధ్యమేనా?

వార్డు, గ్రామ సచివాలయ సెక్రటరీలు, కిందిస్థాయి ఉద్యోగులు రూ. 30 వేల నుంచి రూ.40 వేల లోపు జీతాలు అందుకుంటున్నారు. ప్రభుత్వ టార్గెట్‌ను పూర్తి చేసేందుకు ఉన్నతాధికారులు సచివాలయ సెక్రటరీలపై తీవ్ర ఒత్తిడి తీసుకొస్తున్నారు. బంగారు కుటుంబాలను దత్తత తీసుకొనేందుకు అవసరమైన మార్గదర్శకుల ఎంపిక బాధ్యతను సచివాలయ సెక్రటరీలకు, మండల స్థాయి అధికారులకు అప్పగించారు. ఎంపిక చేయని పక్షంలో మీరే దత్తత తీసుకోవాలంటూ తీవ్ర ఒత్తిడి తెస్తుండడంతో అనేక మంది సచివాలయ సెక్రటరీలు రెండు నుంచి నాలుగు కుటుంబాలను దత్తత తీసుకున్నారు. రూ.40 వేల లోపు ఉద్యోగులు పేదల కుటుంబాలను దత్తత తీసుకొని వారి జీవితాల్లో మార్పు తీసుకురావడం ఏ మేరకు సాధ్యమో ప్రభుత్వమే చెప్పాలి. అసలే చాలీచాలని జీతాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్న సచివాలయ సెక్రటరీలకు మార్గదర్శకులు అవతారం ఎత్తడం సమస్యగా మారింది. మా కుటుంబాలే పేదరికంలో ఉంటే మరికొన్ని పేద కుటుంబాలను బంగారు కుటుంబాలుగా ఎలా మార్చుతామంటూ ప్రశ్నిస్తున్నారు. తమపై అధికారులు తీవ్ర ఒత్తిడి తెస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మభ్యపెట్టే ప్రయత్నం



పీ–4 పేరుతో ప్రభుత్వం పేద ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోంది. జిల్లాలో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న రేషన్ కార్డు దారులు 6 లక్షల పైగా ఉంటే, పేదలు కేవలం 80 వేలు అంటూ ప్రభుత్వం చెప్పడం హాస్యాస్పదం. పీ4 అంతా బూటకమే. అసలైన పేదలు అందులో ఉన్నారా అనేది అనుమానమే. పీ4లో చిరు ఉద్యోగులను భాగస్వామ్యులను చేసి వారిని హింసించడం తగదు. – వందవాసి నాగరాజు, సీపీఎం జిల్లా కార్యదర్శి, తిరుపతి జిల్లా

అంతా నాటకమే



పీ–4 విధానం అంటూ ప్రభుత్వం ప్రగల్భాలు పలకడం అంతా నాటకమే.. పేదలు నివసిస్తున్న ప్రాంతాల్లో మౌలిక వసతులు, ఉపాధి, ఉద్యోగావకాశాల కల్పన చేపట్టాల్సిన అవసరం ఉంది. దత్తత తీసుకుని ఎన్ని రోజులు పోషిస్తారో అర్థం కాలేదు. గతంలో దత్తత తీసుకుని అటు వైపు చూడని పరిస్థితి అందరికీ తెలిసిందే. – జయచంద్ర, సీఐటీయూ జిల్లా కార్యదర్శి, తిరుపతి

ఎంపిక సరైంది కాదు..



బంగారు కుటుంబాల ఎంపికకు ప్రామాణికంగా బీపీఎల్‌ను తీసుకోవాలి. జిల్లాలో దాదాపు 6 లక్షల మంది బీపీఎల్ హోల్డర్స్ ఉన్నారు. కానీ కేవలం 80 వేల కుటుంబాలను పీ–4కు ఎంపిక చేయడం సరైంది కాదు. మిగిలిన కుటుంబాల పరిస్థితి ఏమిటి? వారు బంగారు కుటుంబాలు కాకూడదా? రేషన్ కార్డు హోల్డర్ అందర్నీ ఈ కార్యక్రమంలోకి చేర్చాలి. – కదిరి రాజేంద్ర, తిరుపతి నగర కార్యదర్శి, వైఎస్సార్‌సీపీ వైఎస్సార్‌సీపీ

పారిశుద్ధ్యలోపంతోనే.. ఎస్వీయూలో చిరుతల సంచారం

- మీడియా సమావేశంలో డీఎఫ్‌వో వివేక్ వెల్లడి



మాట్లాడుతున్న జిల్లా అటవీశాఖాధికారి వివేక్

తిరుపతి మంగళం : ఎస్వీ యూనివర్సిటీ, సమీపంలోని వర్సిటీల పరిధిలో చిరుతల సంచారానికి కారణం పారిశుద్ధ్య నిర్వహణే అని, అది మెరుగ్గా నిర్వహించినప్పుడే చిరుతల సంచారం అరికట్టగలుగుతామని జిల్లా అటవీశాఖ అధికారి వివేక్ స్పష్టం చేశారు. జిల్లా అటవీ శాఖ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎస్వీయూలో పారిశుద్ధ్య నిర్వహణ, వృథాగా ఆహారం బయట పడేయకుండా ఉంటే వాటిని తినడానికి వచ్చే కుక్కలు, పిల్లులు, ఎలుకల సంచారం తగ్గిపోతుందన్నారు. దీంతో ఆహార అన్వేషణలో భాగంగా అడవుల నుంచి చిరుతల సంచారం వర్సిటీల పరిధిలో తగ్గిపోయే అవకాశం ఉంటుందన్నారు. తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని గృహ నిర్మాణ వ్యర్థాలు, ఆహార వ్యర్థాలను వేయకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. వర్సిటీ పరిధిలో ఎక్కువగా సంచరించే కుక్కలను పట్టుకుని వేరొక ప్రాంతంలో విడిచి పెట్టడానికి ఇప్పటికే సంబంధిత అధికారులకు లేఖలు రాశామన్నారు. చిరుతను బంధించడానికి కృషి చేసిన ఎఫ్ఆర్ఓ సుదర్శన్ రెడ్డిని, 25 మంది అటవీశాఖ సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. శ్రీకాళహస్తి మండలం సింహాచలం కంచ్రిగ వద్ద దాదాపు 100 ఎకరాల్లో మొక్కలు నాటే కార్యక్రమానికి జిల్లా అటవీ శాఖ ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేస్తుందన్నారు.

దేవాంగ పిల్లుల సంరక్షణకు చర్యలు

శేషాచలం అటవీ పరిధిలో అంతరించిపోతున్న జాబితాలో ఉన్న అరుదైన జీవిగా గుర్తింపు పొందిన (స్లెండర్ లోరీస్)దేవాంగ పిల్లి పరిరక్షణకు, వాటి సంతతి పునరుద్ధరణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా అటవీశాఖాధికారి వివేక్ తెలిపారు. తిరుపతి, చిత్తూరు జిల్లా పరిధిలో 441 దేవాంగ పిల్లులు ఉన్నట్లుగా ఇటీవల సీనియర్ ప్రైమేట్ రీసెర్చ్ ఎక్స్పర్ట్ డాక్టర్ ఆర్.శశి అధ్యయనం చేశారన్నారు. ఏనుగుల సంచారానికి సంబంధించి 5 కిలోమీటర్ల రేడియస్ ప్రాంత పరిధిలో నివసించే ప్రజలకు ఒక అప్రమత్తత మెసేజ్ ను ఆర్టిజీఎస్ టెక్నాలజీ ద్వారా పంపడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు.

టూరిజం అభివృద్ధికి కృషి

- ఏర్పేడు సమీపంలో రూ.80 కోట్లతో రిసార్ట్స్ ఏర్పాటు



కలెక్టర్‌ను కలిసిన టూరిజం అధికారులు

తిరుపతి అర్బన్: జిల్లాలో టూరిజం అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దామని కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో టూరిజానికి చెందిన మెస్సర్స్ కిరితార రిసార్ట్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సత్యనారాయణ, ఆర్కిటెక్ అధికారి గంగరాజు, టూరిజం రీజినల్ డైరెక్టర్ రమణ ప్రసాద్ టూరిజం అభివృద్ధికి కలెక్టర్‌తో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఏర్పేడు సమీపంలోని ఐటీకి చేరువలో రూ.80 కోట్లతో 500 మందికి ఉపాధి కల్పించేలా మెస్సర్స్ కిరితార్ రిసార్ట్స్ ఉంటుందని చెప్పారు. ఈనెల ఒకటో తేదిన గండికోట వద్ద ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు సమక్షంలో పర్యాటకశాఖ వారు రిసార్ట్స్ ఒప్పందాన్ని కుదుర్చుకున్నారని స్పష్టం చేశారు. ఆసియాలోనే అతిపెద్ద స్విమ్మింగ్‌పూల్ ఏర్పాటుతో పాటు లగ్జరీ సూట్స్, హిల్‌వ్యూ విల్లాలు, క్లబ్ హౌస్, ఇండోర్, అవుట్‌డోర్ గేమ్స్ ఆడుకునేలా రిసార్ట్స్‌ను రూపొందిస్తారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటకశాఖ అధికారి జనార్దన్‌రెడ్డి, డైరెక్టర్లు సుబ్బరాయుడు, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

పాదయాత్రకు పోలీసుల అడ్డంకి



అక్రమ అరెస్టు నుంచి బయటకు వస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



శ్రీవారిమెట్టులో పాదయాత్రగా వెళ్తున్న వ్యక్తిని ఈడ్చుకెళ్తున్న పోలీసులు



అక్రమ అరెస్టుపై మండిపడుతున్న విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళీధర్

చంద్రగిరిలో ఉద్రిక్తత..!

- ఎంపీ మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టు నుంచి బయటపడాలని అభిమానుల పాదయాత్ర
- పాదయాత్రను అడ్డుకుని స్టేషన్‌లో నిర్బంధించిన పోలీసులు
- పోలీసుల తీరుతో శ్రీవారిమెట్టు వద్ద భయాందోళనకు గురైన భక్తులు
- డీఎస్పీ ప్రసాద్ మీడియాపై ఆంక్షల పేరుతో చిందులు

చంద్రగిరి : శాంతియుతంగా పాదయాత్ర చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడంపై చంద్రగిరిలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి అక్రమ అరెస్టు నుంచి త్వరగా బయటకు రావాలని, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార విభాగం అధ్యక్షుడు హరిప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో తిరుమలకు పాదయాత్రను చేపట్టారు. అయితే కూటమి ప్రభుత్వంలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ పోలీసులు మంగళవారం శ్రీవారిమెట్టు వద్ద అడ్డుకున్నారు. శ్రీవారి మెట్టు నుంచి తిరుమలకు వెళ్తున్న వారిని అక్రమంగా అడ్డుకోవడంతో పాటు బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు. అభిమానులను ఈడ్చుకొంటూ స్టేషన్‌కు తరలించారు. దీంతో తిరుమలకు వెళ్తున్న భక్తులు సైతం తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

అరాచక పాలన

సుమారు 4 గంటల పాటు పోలీసు స్టేషన్‌లో నిర్బంధించిన నేతలను పోలీసులు సొంత పూచీకత్తుపై రాత్రి విడుదల చేశారు. తిరుమల పాదయాత్రలో ఎలాంటి గొడవలు జరగకుండా ముందస్తుగా అరెస్టు చేసి, విడిచిపెట్టినట్లు పోలీసులు తెలిపారు. టీటీడీ చైర్మన్ ఆదేశాలతోనే అక్రమంగా అరెస్టు చేశారంటూ వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళీధర్ ఆరోపించారు. శాంతియుతంగా చేస్తున్న పాదయాత్రను అడ్డుకోవడం ఏమిటంటూ మండిపడ్డారు. తిరుమలకు వెళ్లాలంటే కూటమి ప్రభుత్వంలో పాస్‌పోర్టు, వీసా కావాలా అంటూ ఆయన ప్రశ్నించారు.



చంద్రగిరి పోలీసు స్టేషన్ వద్దకు చేరుకున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

సుమారు 4 గంటల పాటు స్టేషన్‌లో..

పాదయాత్ర చేస్తున్న హరిప్రసాద్ రెడ్డితో పాటు సుమారు 17 మందిని చంద్రగిరి డీఎస్పీ ఆధ్వర్యంలో పోలీసులు స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి వరకు పోలీసు స్టేషన్‌లోనే అక్రమంగా నిర్బంధించారు. హరిప్రసాద్ రెడ్డిను అరెస్టు చేశారని తెలుసుకున్న పార్టీ శ్రేణులు భారీగా పోలీసు స్టేషన్ వద్దకు చేరుకున్నారు.

మీడియాపై డీఎస్పీ చిందులు

వైఎస్సార్‌సీపీ శ్రేణుల అక్రమ అరెస్టు తెలుసుకున్న జర్నలిస్టులు పోలీసు స్టేషన్‌కు వెళ్లడంతో పోలీసులు అడ్డుకున్నారు. పోలీసు స్టేషన్‌లోకి ఎలా వస్తారంటూ చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్ చిందులు వేశారు. జర్నలిస్టుగా వచ్చామని, అరెస్టుకు సంబంధించి వివరాలు తెలపాలని కోరడంతో ఆయన ఆంక్షల పేరుతో చిందులు వేయడంపై పాత్రికేయులు మండిపడ్డారు.

ఎన్ఆర్ఐల భూములకు రక్షణ కరువు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సునీత



ఆక్రమించుకున్న స్థలంలో ఏర్పాటు చేసిన సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి నారా లోకేష్ ఫొటోలు

- ఆక్రమించుకుని సీఎం, లోకేష్ ఫొటోలు ఏర్పాటు
- రాజకీయ అండతో దౌర్జన్యం
- తిరుపతిలో టీడీపీ నేత ఆక్రమణలపై ఎన్ఆర్ఐ ఆగ్రహం

సాక్షి ప్రతినిధి, తిరుపతి : కూటమి ప్రభుత్వంలో ఎన్ఆర్ఐలకు చెందిన భూములు, స్థలాలకు రక్షణ కరువైందని డాక్టర్ సునీత ఆరోపించారు. ఆక్రమించిన భూముల్లో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఫొటోలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి బెదిరింపులకు దిగుతున్నట్లు ఆధారాలతో బయటపెట్టారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎన్ఆర్ఐకి చెందిన డాక్టర్ సునీత మాట్లాడుతూ.. 2003లో తిరుపతి నగర పరిధిలోని కైకాల చెరువు వద్ద వేసిన ప్రగతి నగర్ వెంచర్‌లో సర్వే నంబర్1లో కోట్ల రూపాయలు విలువ చేసే ఏడు ప్లాట్లను కొనుగోలు చేసినట్లు అందుకు సంబంధించిన పత్రాలను విలేకరుల ముందు బయటపెట్టారు. తాము కొనుగోలు చేసిన కొంత కాలం తరువాత ఈ ప్లాట్లు తమవే నంటూ టీడీపీ నేత, బాలాజీ టింబర్ డిపో అధినేత కంచి రాము ఇబ్బందులు పెట్టడం ప్రారంభించారని వెల్లడించారు. ప్లాట్లకు దారి లేకుండా ప్రహరీ గోడ, తాత్కాలిక షెడ్లు నిర్మించాడని వివరించారు. ఆ తరువాత సర్వే నంబర్ 1/1బి పేరుతో రికార్డులు సృష్టించుకున్నట్లు ఆరోపించారు. ఆ సర్వే నంబర్లను రద్దు చేశారని, ఆ తరువాత రోడ్ల కోసం వదిలిన స్థలాల పేరుతో రూ.60 కోట్లు విలువచేసే టీడీఆర్ బాండ్లు తీసుకున్నట్లు తెలిపారు. టీడీపీ నేత రాము సృష్టించిన సర్వే నంబర్ బోగస్ అని రెవెన్యూ అధికారులే చెబుతున్నారన్నారు. గతంలో జేసీగా పనిచేసిన బాలాజీ సైతం ఆ భూమి తమకు చెందినదేనని జడ్జిమెంట్ ఇచ్చినట్లు స్పష్టం చేశారు. తమ ప్లాట్లు ఆక్రమించాడని గత ఏడాది తిరుపతి ఈస్ట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆ స్థలంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ బాబు ఫొటోలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి తమలను బెదిరిస్తూ భయపెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై గతంలో సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. ఆస్ట్రేలియాకు చెందిన సునీతకు అన్యాయం జరిగిందని సీఎం చంద్రబాబే స్వయంగా చెప్పినా ఇంత వరకు న్యాయం జరగలేదని ఆమె ఆరోపించారు. ఎన్ఆర్ఐలకు చెందిన భూములకు రక్షణ కల్పించాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రగల్భాలు పలికినా.. ఆచరణకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు సంబంధించిన స్థలంతో పాటు పరిసర ప్రాంతంలోని అనేక మంది టీడీపీ నేతల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వెల్లడించారు. అయినా ప్రభుత్వం అతడిపై చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.1,02,130
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.9,221

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.1,16,900
రిటైల్ వెండి గ్రాము	రూ.119.90

క్లుప్తంగా

ట్రాక్టర్ బ్యాటరీ చోరీ

కలువాయి (సైదాపురం) : మండలంలోని గార్ల పాడు గ్రామానికి చెందిన కొత్త మస్తానయ్యకు చెందిన ట్రాక్టర్ బ్యాటరీని సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించారు. రాత్రి ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఈ చోరీ జరిగిందని బాధితుడు వాపోయాడు. వరుస దొంగతనాలతో మండల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం


విరాళం అందజేస్తున్న దాతలు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి మంగళవారం విజయవాడకు చెందిన బొమ్మరాజు రఘునాథరావు తన భార్య పేరు మీదుగా రూ.1,01,116 అందజేశారు. ఆలయ అధికారులు స్వీకరించి దాతకు కృతజ్ఞతలు తెలిపారు. వారికి స్వామి, అమ్మవార్ల అంతరాయల దర్శనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో బెయిల్‌పై వచ్చిన వ్యక్తి అరెస్టు

తిరుపతి రూరల్ : బాలికపై లైంగికదాడి ఘటనలో పోక్సో కేసులో జైలుకు వెళ్లి రిమాండ్ ఖైదీగా శిక్ష అనుభవించి బెయిల్‌పై బయటకు వచ్చిన వ్యక్తిని మరోసారి పోలీసులు అరెస్టు చేశారు. తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు సమాచారం మేరకు.. తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఈశ్వర్ రెడ్డి గతంలో తన భార్య మొదటిభర్త కుమార్తెపై లైంగికదాడి ఘటనలో పోక్సో కేసు నమోదు చేయగా రిమాండ్ విధించారు. ఇటీవల బెయిల్‌పై బయటకు వచ్చిన ఆ వ్యక్తి ఈనెల16వ తేదీన పోక్సో కేసులో ఫిర్యాది అయిన బాధితురాలిని బెదిరించి ఇంట్లోని వస్తువులపై పెట్రోల్ పోసి కాల్చివేశాడు. ఈ ఘటనపై మరో కేసు నమోదు చేసిన తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు మంగళవారం నిందితుడైన ఈశ్వర్‌రెడ్డిని అరెస్టు చేశారు. అనంతరం న్యాయమూర్తి ముందు హాజరు పరచగా 14రోజుల రిమాండ్ విధించారు.

రహదారుణాలు

తిరుపతి జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు ఛిద్రమయ్యాయి. గత ప్రభుత్వంలో రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని గగ్గోలు పెట్టారు.. ప్రస్తుతం కూటమి నేతలు అరకొరగా అక్కడక్కడా ప్యాచ్ వర్క్‌లు చేసి చేతులు దులుపుకున్నారు. మరికొన్ని చోట్ల నాణ్యత లేకుండా రోడ్డు వేసి పచ్చనేతలు జేబులు నింపుకున్నారు. వేసిన ఆరు నెలల్లోనే గుంతల పడి రహదారులు దారుణంగా మారాయి. రోడ్ల దుస్థితి చూసిన ప్రజలు ఇప్పుడేమంటారు బాబూ అంటూ ప్రశ్నిస్తున్నారు.


తిరుపతి ఆటోనగర్‌లోని ఇండస్ట్రియల్ ప్రాంతంలో రోడ్ల దుస్థితి ఇలా..


తిరుపతి-కరకంబాడి రోడ్డు లేపర్సీ హాస్పిటల్ కు ఎదురుగా సుబ్బారెడ్డి నగర్ రెండవ వీధి దుస్థితి - తిరుపతి తుడా


గూడూరు నుంచి విందూరుకు వెళ్లే రహదారిని గతేడాది తాత్కాలిక మరమ్మతులు పెట్టి పూర్తి చేయగా వర్షాలకు అడుగో గుంత - చిల్లకూరు


చంద్రగిరి మండలంలోని నారావారిపల్లి నుంచి పులిచెర్ల మండలం కామవరం కొత్తపేట వరకు ఏడాదికే ప్యాచ్‌లు లేచిపోయిన దుస్థితి


మరమ్మతులకు నోచుకోని సైదాపురం-పొదలకూరు రహదారి దుస్థితి


బాలాయపల్లి -వెంకటగిరిలో దెబ్బతిన్న ప్రధాన రహదారి - సైదాపురం


రామచంద్రాపురం : అనుపల్లి నుంచి రాయలచెరువు కట్ట వరకు రహదారికి మరమ్మతులు చేయగా చేసిన మూడు రోజులకే మట్టి లేచిపోయిన రోడ్డు దుస్థితి ఇలా.. - చంద్రగిరి, తిరుపతి రూరల్



శ్రీకాళహస్తి నుంచి వెంకటగిరి, కాసరం వెళ్లే ప్రధాన మార్గంలో గుంతలమయంగా రహదారి



గుంతలమయంగా శ్రీకాళహస్తి నుంచి పెన్నలపాడు, విరూపాక్షిపురం రోడ్డు - తొట్టంబేడు


గోవర్ధన్‌పురం పైప్ కల్వర్టు ప్రాంతంలో ఆరు నెలల క్రితం తారురోడ్డు వేయగా ప్రస్తుతం తారులేచి పోయి బావులను తలపిస్తున్న గుంతలు - వరదయ్యపాళెం


ఎన్‌టీఆర్ నగర్ వరకు ఐదు నెలల క్రితం నాణ్యత లేకుండా రోడ్డు మరమ్మతులు.. నేడు బుచ్చినాయుడుకండ్రిగలో ప్యాచ్‌లు లేచి అధ్వాన్నంగా రోడ్డు


డిప్యూటీ సీఎం ఆదేశాల మేరకు ఎనిమిది నెలల కిందట సూళ్లూరుపేట రోడ్డు బుచ్చినాయుడుకండ్రిగ, పెరిటిపాడు వరకు రోడ్డుకు తూతూ మంత్రంగా మరమ్మతులు.. ప్రస్తుతం వర్షాలకు గుంతలమయంగా రహదారి ఇలా.. - బుచ్చినాయుడుకండ్రిగ

వాహనాలు ఢీ : ఏడుగురికి గాయాలు


దెబ్బతిన్న రెండు వాహనాలు

నాయుడుపేటటౌన్ : మండల పరిధిలోని అయ్యప్పరెడ్డి పాళెం గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం నాలుగు వాహనాలు ఒకదానికి ఒకటి అదుపు తప్పి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు కార్లు బాగా దెబ్బతిన్నాయి. రెండు కార్లలో ఉన్న ఏడుగురికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు. ఒడిస్సా నుంచి బెంగళూరు వెళుతున్న లారీ మార్గ మధ్యలో అయ్యప్పరెడ్డి పాళెం జాతీయ రహదారి కూడలి సమీపంలో అదుపు తప్పి ముందు వెళుతున్న కారును ఢీకొంది. ఆ కారు ముందు వెళుతున్న మరో కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో రెండు కార్లు బాగా దెబ్బతిన్నాయి. ఓజిలి ప్రాంతానికి చెందిన ఫ్రాంక్లిన్, మల్లికార్జున రెడ్డి, షేక్ రఫీ, బన్నీ , మరో కారులో ఉన్న మద్ది వీరయ్య, సునీత, సాయిలకు గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన లారీని పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపకశాఖ అధికారులు

దక్కిలి : విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధమయింది. ఈ ఘటన మండలంలోని ఆల్తూరుపాడులో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. అగ్నిమాపకశాఖ అధికారి ఆదినారాయణ కథనం మేరకు ఆల్తూరుపాడు గ్రామానికి చెందిన కటకం రమణయ్య పూరి గుడిసెలో నివాసం ఉంటున్నారు. ఇంట్లో విద్యుత్ వైర్లు షార్ట్ సర్క్యూట్ కావడంతో ఒక్కసారిగా మంటలు వ్యాప్తి చెందాయి. ఆ సమయంలో ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలింది. దీంతో ఆందోళన చెందిన స్థానికులు అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి వారు చేరుకొని మంటలను అదుపు చేశారు. బాధితుడికి రూ.లక్ష ఆస్తి నష్టం జరిగి ఉండవచ్చునని భావిస్తున్నట్లు తెలిపారు.

ప్రొఫెసర్ దేవప్రసాదరాజుకు ప్రతిష్టాత్మక పురస్కారం



పురస్కారం అందుకుంటున్న ప్రొఫెసర్ దేవప్రసాదరాజు

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఫిజిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ బి దేవ ప్రసాద రాజు ప్రతిష్టాత్మక పురస్కారం పొందారు. రేర్ ఎర్త్ రంగంలో చేసిన పరిశోధనా కృషికి గుర్తింపుగా రేర్ ఎర్త్ అసోసియేషన్ ఈ పురస్కారాన్ని అందజేసింది. గురువారం భువనేశ్వర్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో నీతి అయోగ్ సభ్యుడు డాక్టర్ వీకే సరస్వత్ చేతుల మీదుగా ఆయన పురస్కారాన్ని అందుకున్నారు. 16 ఏళ్లుగా ఎస్వీయూలో ఎన్నో పేరొందిన పరిశోధనలు చేపట్టిన ఆయన 5 జాతీయ, 3 అంతర్జాతీయ సదస్సులు, పరిశోధనా ప్రాజెక్టులను సమర్థవంతంగా నిర్వహించారు. అంతర్జాతీయ స్థాయి జర్నల్స్‌లో ఆయన రూపొందించిన 125 పరిశోధనా వ్యాసాలు ప్రచురితమయ్యాయి. 13 పీహెచ్‌డీ డిగ్రీలు పర్యవేక్షకులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా రేర్ ఎర్త్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ ఎంఎల్‌పీ రెడ్డి, ఎస్వీయూ రిటైర్డు ప్రొఫెసర్ సీకే జయశంకర్, సైన్స్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పద్మావతి పురస్కారం పొందిన ఆయనను అభినందించారు.

ధర్నాతో దద్దరిల్లిన ఎస్వీయూ

- తాత్కాలిక అధ్యాపకుల నిరసన


ఎస్వీయూ పరిపాలనా భవనం ఎదుట నిరసన తెలుపుతున్న తాత్కాలిక ఉద్యోగులు, విదార్థి సంఘాలు

తిరుపతి సిటీ : ఎస్వీయూలో తొలగించబడిన తాత్కాలిక అధ్యాపకులు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. మంగళవారం వర్సిటీ పరిపాలనా భవనం ఎదుట బైఠాయించి వర్సిటీ అధికారుల తీరును ఎండగట్టారు. అధ్యాపకులు నిరసన కార్యక్రమానికి విద్యార్థి సంఘాల నాయకులు హాజరై మద్దతు పలికారు. ఈ సందర్భంగా తొలగించిన అధ్యాపకులు మాట్లాడుతూ.. అన్ని అర్హతలు ఉన్నా కక్ష సాధింపు చర్యలో భాగంగా వర్సిటీ అధికారులు 43 మంది అకడమిక్ కన్సల్టెంట్లను తొలగించి రోడ్డున పడేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

పాలకమండలిని మభ్యపెట్టి....

పాలక మండలికి అకడమిక్ కన్సల్టెంట్ల తొలగింపుపై పూర్తి సమాచారం ఇవ్వకుండా చర్చించకుండా ఇంటర్వ్యూలు నిర్వహించారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఓ పాలకమండలి సభ్యురాలు తనకు అవగాహన లేకపోవడంతో ఆమోదం తెలిపానని బహిరంగంగా వీసీకి లేఖ రాశారంటే అధికారుల తీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని చెప్పారు. అనంతరం వీసీ అప్పారావును కలిసి వారు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో అకడమిక్ కన్సల్టెంట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కల్లూరి కిషోర్‌కుమార్‌రెడ్డి, సభ్యులు, వైఎస్సాఆర్‌సీపీ ఎస్వీయూ విద్యార్థి విభాగం అధ్యక్షులు ప్రేమ్ కుమార్, ఎస్ఎఫ్ఐ కార్యదర్శి రవి, వినోద్, ఉపాధ్యక్షులు అశోక్, బీడీవీఎస్ నాయకులు యుగంధర్, సుకుమార్, విద్యార్థి సంఘాల నాయకులు ముని హేమంత్, భరత్, తాత్కాలిక అధ్యాపకులు పాల్గొన్నారు.

న్యాయపోరాటానికి సన్నద్ధం

వర్సిటీ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా తాత్కాలిక అధ్యాపకులను తొలగించడంపై న్యాయపోరాటానికి సిద్ధమవుతున్నాం. ఇప్పటికే ఈ విషయంపై ఉన్నత స్థాయి అధికారులకు తెలియజేశాం. న్యాయవాదుల సలహాలు తీసుకున్నాం. ఈ విషయంపై వెనకడుగు వేసేదేలేదు. డిప్యూటీ సీఎం దృష్టికి సైతం ఈ విషయాన్ని తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నాం. – తొలగించిన తాత్కాలిక అధ్యాపకులు, ఎస్వీయూ

ఏటీఎంలో చోరీకి విఫలయత్నం

తిరుమల : తిరుమలలోని యూనియన్ బ్యాంక్ ఏటీఎంలో ఓ దొంగ చోరీకి విఫలయత్నం చేసిన సంఘటన మంగళవారం వెలుగుచూసింది. తిరుమల టూటౌన్ సీఐ శ్రీరాముడు తెలిపిన వివరాలమేరకు కర్ణాటక రాష్ట్రం, తుమకూరుకు చెందిన ప్రవీణ్‌కుమార్ సోమవారం రాత్రి 11.30 గంటల సమయంలో వైకుంఠం క్యూకాంప్లెక్స్-1కు ఎదురుగా ఉన్న యూనియన్ బ్యాంక్ ఏటీఎంలోకి ప్రవేశించి చోరీకి యత్నించాడు. ఈ విషయాన్ని గుర్తించిన బ్యాంక్ మేనేజర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఏటీఎం వద్దకు చేరుకుని పరిశీలించారు. అనంతరం సీసీ కెమెరా నిఘా నియంత్రణ కేంద్రంలో ఏటీఎంను పూర్తిస్థాయిలో పరిశీలించగా సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ఓ వ్యక్తి ఏటీఎంలోని సీసీ కెమెరా వైర్లను కత్తిరించినట్లు గుర్తించారు. అనంతరం పోలీసులు అతని కోసం గాలించి స్థానిక కల్యాణ వేదిక వద్ద పట్టుకుని స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. నిందితుడిని విచారించగా అతని మానసిక పరిస్థితి సరిగా లేనట్లు గుర్తించామని తెలిపారు. అతన్ని ఆస్పత్రికి తరలించి మానసిక పరిస్థితిని తెలుసుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

డీఫార్మసీ ప్రవేశాల దరఖాస్తులకు గడువు పెంపు

తిరుపతి సిటీ: ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి డీఫార్మసీ కోర్సు ప్రవేశాల కోసం దరఖాస్తుల గడువును ఈ నెల 23వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ వై.ద్వారకనాథ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారంతో ముగిసిన దరఖాస్తుల గడువును విద్యార్థుల సౌకర్యార్థం సాంకేతిక విద్యాశాఖ 23వరకు పొడిగిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హతగల అభ్యర్థులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ఉపాధి పనులపై విచారణ


ఫీల్డు అసిస్టెంట్ పుష్పవల్లి భర్త మునీశ్వరయ్య ఫిర్యాదుదారులపై దౌర్జన్యం చేయడంపై వార్నింగ్ ఇస్తున్న పీడీ

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2024 – 2025 ఏడాదిలో పూర్తి చేసిన పనులపై మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మంగళవారం 19వ విడత బహిరంగ విచారణ జరిగింది. ఈ విచారణకు డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ విచారణ అధికారిగా హాజరయ్యారు. సామాజిక తనిఖీల్లో భాగంగా పేరూరు చెరువుకు సంబంధించి రూ.1.50 కోట్లు మేరకు గుంతలు తీసినట్టుగా బిల్లులు చేసుకున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. దానిపై సమగ్ర విచారణ జరపాలని కోరుతూ ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్‌కు వినతి పత్రం అందించారు. సమగ్ర విచారణ చేసి పది రోజుల్లో నివేదికను సమర్పించాలని ఎంపీడీఓ రామచంద్ర, ఏపీడీ రెడ్డెప్ప విజిలెన్స్ అధికారులను పీడీ ఆదేశించారు. అలాగే దుర్గసముద్రం పరిధిలో ఒక్క కూలీ కూడా పనులు చేయకుండానే 57 మంది పనులకు హాజరైనట్టుగా నమోదు చేయడం జరిగిందని, దానిపై కూడా విచారణ చేయాలని ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి కోరగా దానిపై విచారణ చేయాలని ఏపీఓ జ్యోతిశ్రీని ఆదేశించారు. పలువురు ఫీల్డు అసిస్టెంట్లు చేసిన తప్పిదాలు బయటకు రావడంతో వారి నుంచి రూ.48 వేలు వరకు రికవరీ చేయాలని ఆదేశించారు. పెరుమాళ్లపల్లికి చెందిన ఫీల్డు అసిస్టెంట్ పుష్పవల్లి పని చేయలేకుంటే ఆమె చేత రాజీనామా తీసుకుని వేరొకరికి అవకాశం కల్పించాలన్నారు. వైస్ ఎంపీపీ విడుదల మాదవరెడ్డి, జడ్పీటీసీ రత్నమ్మ, ఏపీడీ రెడ్డెప్ప, డీఆర్‌డీఓ ప్రభావతి, ఎస్ఆర్‌పీ లోకేష్, ఏపీఓలు జ్యోతిశ్రీ, మమత, టెక్నికల్ అసిస్టెంట్ హరి పాల్గొన్నారు.